# ఇలా జరిగేను!

మునిపల్లె సరోజినీదేవి



ముక్కుకి సూటిగా పోయేవాళ్ళకెప్పుడూ ఎదురు దెబ్బలే మరి.

ఎవరినని ఏమిటి లాభం? ప్రపంచంలో జీవించాలంటే నటించటం చాలా అవసరం. ఆమాటే అన్నాడు ప్రఖ్యాత నాటక కర్త షేక్స్పియర్. ఎంతో జీవితానుభవం మీద మానవాభ్యుదయానికై ముత్యాల్లాంటి మాటలు కూర్చాడు.

కానీ పరిస్థితుల ప్రభావానికి తలొగ్గి నిత్య నూతన సమస్యలతో సతమత మయ్యే మాలతి కామాటల అర్థం ఎలా బోధపడుతుంది! అర్థం బోధపడినంతమాత్రాన సరిపోతుందా? ఆచరించటానికి అలవాటు కావద్దూ?

జీవితమంటే ఏమిటి?

సమస్యల తోరణాలతో జీవిత ద్వారబంధానికి అలంకారంచేసి అందమైన అబద్ధాలతో రంగు రంగుల పూవులల్లి, అందంగా, ఆకర్షనీయంగా కనబడేటట్లు పై మెరగులు దిద్ది, చేదు మాత్రకి చక్కెర కోటింగ్ లా, మనస్సులో మెదిలే హాలాహాలానికి తియ్యటి మాటల తేనెపూత పూసి, అందరికీ తలలో నాలికలా మెలగటం ఎవరికి చేతనవుతుంది? అలా నటించగలవాళ్ళే సుఖంగా మనగలుగుతారు. అన్ని సౌఖ్యాలనీ అంది పుచ్చుకుంటారు. అందలం ఎక్కుతారు.

పరమపదసోపాన పటంలో పాములెన్ని ఉన్నాయి? కోరలు తెరిచి నాలుకలు చాచి విషాన్ని వెడల



గ్రక్కటానికి అవకాశం కోసం ఎదురు చూచే నాగులెన్ని? ఒడుపుగా, వయ్యారంగా, వనమయూరిలా నాట్యమాడి, నేర్పుగా, ఓర్పుతో గండాలన్నీ గడిచి గట్టెక్క గల గటం అందరికీ చేతనవుతుందా?

అలాంటి చిట్కాల ప్రభావం ఎలా ఉంటుందో, అమాయకురాలు మాలతికేం తెలుసు పాపం!!

తనకి ఒప్పగించిన పని త్వరగా పూర్తిచెయ్యటం మాలతికి ఉన్న దురలవాట్లలో ఒకటి. అదే మాలతి పట్ల మారణాయుధంగా మారిపోయింది. అందరికీ కోటాప్రకారం పని పంచి పెడతారు.

మిగతా వారంతా నవ్వుతూ, తుళ్ళుతూ, సరదాగా కబుర్లాడుతూ పొద్దుటినుంచీ, సాయంత్రందాకా ఏక బిగిని పని చేస్తూనే వుంటారు. అయినా పని తెమలదు. కట్టలు, కట్టలు కాయితాలు అన్నీ టేబిల్ నిండా పేరుకుపోయి ఉంటాయి. అవే వారికి శ్రీరామ రక్ష. పెట్టని కోటల్లా నిటారుగా నిలిచి ఆపద సమయాల్లో అధికారుల బారినుండి ఆత్మరక్షణకు అవకాశం కల్పిస్తాయి. కోటలోపల కూర్చొని ఏమి చేసినా హఠాత్తుగా వచ్చిన పై అధికారి కండ్లకేమి కనిపించదు. ఆ అధికారి రాకను గమనించగానే తెలివిగా తప్పించుకోవటానికి వీలవుతుంది.

అదే అసలు మర్మం. మూలనున్న ధర్మరక్షణోపాయం. అదే అసహాయుల పాలిటి ఆత్మరక్షణాయుధం.

ఈ కిటుకు లన్నీ మాలతికి తెలీవు. కిటుకు తెలీని వారి బ్రతుకు కటకటల కాలవాలం. ఏ రోజు యిచ్చిన పని ఆ రోజునే పూర్తి చెయ్యటం మాలతికి అలవాటు.

ఆ అలవాటే అపకారిగా అవతరించింది. "మాలతీ ఈ పుస్తకం చదివి నీ అభిప్రాయం చెప్పు" అంటూ మారుతి ఓ నాటకం తెచ్చి యిచ్చింది.

పేరు "అస్వతంత్రుడు"

మాలతికి పనేమిలేదు!!

ఊరికే కూర్చోవటం మాలతికి చేతకాని వాటిల్లో ఒకటి.

పుటలు త్రిప్పింది.

పుర్రెలో ఆలోచనలు పుట్టలో నుంచి బయలుదేరిన చీమల బారుల్లా వచ్చేయి. గిరగిర పేజీలు తిరుగుతున్నాయి. జోట జోట కళ్ళ వెంట అశ్రుకణాలు రాలుతున్నాయి.

అది తన ప్రతిబింబమేనా? అద్దంలో ముఖం చూచుకున్నట్లైంది.

పుస్తకంలో లీనమైపోయిన మాలతికి అధికారి అడుగుల సవ్వడి చెవి దూరలేదు.

అప్రమత్తత ఆటంబాంబులా పేలింది. అధికారి దృష్టిలో అపరాధిగా నిలిచిపోయింది.

మేఘగర్జనలా అధికారి కంచు కంఠం ఖంగున చెవుల్లో మ్రోగింది.

ఉలిక్కిపడి తలెత్తి చూచింది.

క్రోధపూరిత నయనాలు కోడె త్రాచుల్లా కాటు వేయటానికి కసిగా చూస్తున్నాయి.

"ఇది ఆఫీసా, లైబ్రరీయా?"

మాలతి పెదవులు భయంతో వణికాయి, పెనుతుఫాను గాలికి విలవిల్లాడే ఆకుల్లా.

చేతులు గజగజ వణికేయి. పట్టు తప్పిన పుస్తకం పుటుక్కున నేల జారింది.

నేలజారిన పుస్తకం నేరుగా ఆఫీసర్ గారి కాళ్ళమీద పడింది, అపరాధం జరిగిందని క్షమార్పణ అర్థించటానికో అన్నట్లు.

అందరూ ఆశ్చర్యంతో అట్టే నిలిచిపోయారు చిత్తరువులోని బొమ్మలు లాగ.

మాలతి మనస్సు మథన పడింది. తడబడే అడుగుల్తో యింటికి చేరింది.

ఫలితం ఎలా ఉంటుందో?

మరునాడు పిలుపు వచ్చింది.

అడుగులు ముందుకిపడుతూఉంటే, మనస్సు వెనక్కి లాగుతూఉంటే ఆఫీసరు గదిలో అడుగుబెట్టింది.

"మీకు సాహిత్యమంటే ఇష్టమా?"

"ఊఁ"

"మరి, ఈఉద్యోగంలో చేరేరేం?"

"ఉదర నిమిత్తం-"

"కూటికొరకు కోటి విద్యలు అన్నట్లు చేరేనంటారా? మీకు కేవలం పుస్తక పఠనమేనా ప్రీతి?"

"..... .... ...."

"మీరేమైనా వ్రాయగలరా?"

"ఏమిటీ?" మాలతి నివ్వెరపోయి చూచింది.

"పాటలు, పద్యాలు, నవలలు, నాటకాలు."

"ఏదో, కొద్దిగా" మాలతి మెల్లగా అన్నది.

"మీ రచనలుంటే ఓసారి ఇవ్వండి."

"అలాగే."

"ఇక మీరు వెళ్ళ వచ్చు."

మాలతి మెల్లగా, చల్లగా సెక్షన్‌కి చేరింది. మాలతి తన రచనలు రెండు తెచ్చి యిచ్చింది. ఆఫీసర్ ఆనందంతో అందుకున్నాడు. మాలతి గుండెల్లో మాత్రం రైళ్ళు పరుగెడుచున్నాయి.

ఉద్యోగం ఊడుతుందేమో?

అదే అందరూ అనుకున్నది!

కానీ, కానీ, కథ అడ్డం తిరిగింది.

మరునాడు మాలతి చేతిలో ఓ కాయితం ముక్క వచ్చిపడింది!

మాలతికి ప్రమోషన్ అట!

అందరికీ ఆశ్చర్యం అంతా, ఇంతా కాదు సుమండీ! అంతే మరి! ★